ఓ మై డాగ్..!

- క్లూస్ టీం డాగ్ సిరి మృతితో పోలీసుల ఆవేదన
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



నివాళి అర్పిస్తున్న పోలీసులు

రాయచూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పలు కేసులను చేధించి, పోలీసులకు అండగా నిలచిన పోలీస్ జాగిలానికి అరుదైన గౌరవం దక్కింది. మృతి చెందిన పోలీస్ జాగిలాన్ని తలుచుకుని పోలీసులు తీవ్ర వేదనకు గురయ్యారు. జిల్లా పోలీస్ శాఖలో 8 ఏళ్లుగా క్లూస్ టీంలో సేవలందించిన సిరి అనే పేరున్న డాబర్మాన్ జాతి జాగిలం మృతి చెందగా దానికి సోమవారం అధికారులు అధికారికంగా అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా పోలీస్ పరేడ్ మైదానం వద్ద అధికారికంగా నిర్వహించిన అంత్యక్రియల్లో జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పట్టమాదయ్య మాట్లాడుతూ 8 ఏళ్లుగా పోలీసులకు నేర పరిశోధనలో ఎంతో సహకరించిన జాగిలం మృతి చెందడం బాధాకరమన్నారు. పలు కేసులను చేధించడంలో ఈ జాగిలం చూపిన నైపుణ్యం మరువలేనిదన్నారు. ముఖ్యంగా 2022లో మాన్వి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోస్ట్ ఆఫీసులో జరిగిన దొంగతనాన్ని చేధించడంలో ఈ జాగిలం చేసిన సాయం ఘనమైనదన్నారు. దాంతో పాటే అనేక కేసుల్లో కేసులను పరిష్కరించడంలోనే నేరస్థులను గుర్తించడంలోను శునకం తనదైన నైపుణ్యాన్ని చాటిందన్నారు. 2016లో జన్మించిన ఈ శునకం 2017లో పోలీస్ క్లూస్ టీంలో చేరి బెంగళూరులోని సీఏఆర్ సౌత్ పోలీస్ స్టేషన్‌లో జయకుమార్, శరణ బసవల నేతృత్వంలో శిక్షణ పొందినట్లు ఆయన వివరించారు. అనంతరం అధికారిక లాంఛనాలతో జాగిలానికి అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం, సమీప పోలీస్ స్టేషన్ల సిబ్బంది, ఎస్పీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్లూస్ టీం జాగిలం.. సిరి (ఫైల్)



చన్నపట్టణ ప్రచారసభలో సీఎం, డీసీఎం తదితరులు



జేడీఎస్-బీజేపీ అభ్యర్థి నిఖిల్ తదితరులు

ఉత్కంఠగా.. ఉపపోరు..!



- చివరిరోజు హోరాహోరీ రోడ్‌షోలు
- రేపు పోలింగ్‌కు సర్వం సిద్ధం
- మూడు స్థానాల్లో టెన్షన్.. టెన్షన్
- ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న కాంగ్రెస్, బీజేపీ

బెంగళూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జరిగేది మూడు స్థానాల ఉప ఎన్నికలే..అయితే ఉత్కంఠ మాత్రం భారీస్థాయికి చేరింది. దీనికి ప్రధాన కారణం ఈ ఎన్నికలను రెండు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. మూడు శాసనసభ స్థానాలకు జరుగుతున్న ఉపసమరంలో ప్రచారఘట్టం సోమవారం ముగిసింది. ఇక ఓటర్లను ప్రసన్నం చేసుకోవడమే తరువాయిగా వ్యూహాలు మొదలయ్యాయి. రామనగర జిల్లా చన్నపట్టణ, హావేరి జిల్లా శిగ్గావి, బళ్ళారి జిల్లా సండూరు నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. కుమారస్వామి, బసవరాజ్ బొమ్మై, తుకారాంలు ఎమ్మెల్యేల స్థానాలకు రాజీనామా చేసి ఎంపీలు కావడంతో ఉపసమరం జరుగుతోంది. ఎన్నికల్లో వారసత్వం, బంధుప్రీతి ప్రతిచోటా కొనసాగింది. శిగ్గావి నుంచి మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై కుమారుడు భరత్ బొమ్మై బీజేపీ అభ్యర్థి అయ్యారు. గతంలో ఓడిన అభ్యర్థి యాసిర్ అహ్మద్‌ఖాన్ పఠాన్ కాంగ్రెస్ నుంచి మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇక సండూరులో ఎంపీ తుకారాం భార్య అన్నపూర్ణ కాంగ్రెస్ అభ్యర్థి కాగా బీజేపీ నుంచి తొలిసారి బంగారు హనుమంతు బరిలో ఉన్నారు. ఈ రెండు నియోజకవర్గాలకంటే చన్నపట్టణ క్రియాశీలకమైంది. ఇక్కడ నుంచి జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడ మనువడు, కేంద్రమంత్రి కుమారస్వామి వారసుడు నిఖిల్ బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇప్పటికే రెండు ఎన్నికల్లో ఓటమి చెందిన నిఖిల్‌కు ఇది అగ్ని పరీక్షగా మారింది. ఇక కాంగ్రెస్ అభ్యర్థిగా సీపీ యోగేశ్వర్ చివరిక్షణంలో బరిలోకి వచ్చారు. బీజేపీకి గుడ్‌బై చెప్పి ఎమ్మెల్సీ స్థానానికి రాజీనామా చేసి కాంగ్రెస్ అభ్యర్థి అయ్యారు. ఇతడు వరుసగా రెండుసార్లు ఇదే స్థానం నుంచి ఓటమి చవిచూశారు. అంతకుముందు ఐదుసార్లు ఎమ్మెల్యేగా కొనసాగిన అనుభవం ఉంది. చన్నపట్టణలో ఇద్దరు అభ్యర్థులకు గెలవడం క్రియాశీలకమే. అభ్యర్థులకంటే కేంద్రమంత్రి కుమారస్వామి వర్సెస్ డీసీఎం డీకే శివకుమార్ అనేలా పోటీ నెలకొంది. మూడు నెలలుగా డీకే శివకుమార్ చన్నపట్టణకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రభుత్వ గ్రాంట్లు మంజూరు చేయడంతోపాటు గ్రామస్థాయిలో జనస్పందన సభలు జరిపారు. ఎంతకైనా చన్నపట్టణలో గెలవాల్సిందేననే పట్టుదలతో డీకే శివకుమార్ ఉన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గానికి అనుబంధమైన బెంగళూరు గ్రామీణ స్థానం నుంచి తమ్ముడు డీకే సురేశ్ ఓటమికి కుమారస్వామి కారకులయ్యారు. రాజకీయాలతో సంబంధంలేని డాక్టర్ సీఎన్ మంజునాథ్‌ను బరిలోకి నిలిపి డీకే సురేశ్‌ను చిత్తుగా ఓడించారు. ప్రస్తుతం జరుగుతున్నది మూడు స్థానాలకు ఎన్నికలైనా జేడీఎస్ పోటీ చేస్తున్నది చన్నపట్టణ మాత్రమే. కానీ హాసన్‌లో జేడీఎస్ ప్రాబల్యం తగ్గింది. ఇప్పటికే రామనగరలో నిఖిల్ ఓటమితో పార్టీకి గడ్డుకాలం ఏర్పడింది. చన్నపట్టణలో ఓడిపోతే రామనగర జిల్లాలోనూ దెబ్బతీసినట్టు అవుతుందని డీకే శివకుమార్ భావిస్తున్నారు. అందుకోసమే దాదాపు నెలరోజులుగా డీకే సురేశ్ చన్నపట్టణలోనే మకాం వేసి గ్రామస్థాయి నుంచి ప్రతి కుటుంబాన్ని కలుస్తున్నారు. భారీగా పంపిణీలకు ఏర్పాట్లు చేసినట్టు తెలుస్తోంది. ఎన్నికల కమిషన్ కూడా నిఘా పెంచింది. అయితే అధికార పార్టీకి కొంత కలిసొస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాజకీయాలు సాగుతున్నాయి.

హోరెత్తిన ప్రచారం

మూడు స్థానాలకు మాత్రమే జరుగుతున్న ఎన్నికలైనా అధికార కాంగ్రెస్ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష బీజేపీ-జేడీఎస్‌ల నుంచి అగ్రనేతల నుంచి ఎమ్మెల్యేల దాకా అందరూ అక్కడే గడుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి నియోజకవర్గానికి పదిమంది మంత్రులతోపాటు 30-40మంది ఎమ్మెల్యేలను కేటాయించారు. ఇదే తరహాలోనే బీజేపీ కూడా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఇన్‌చార్జ్‌లుగా క్యాంపెనర్‌లుగా ప్రకటించింది. సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు గ్రామస్థాయి సభల్లో పాల్గొనగా ప్రతిపక్షనేత అశోక్, బీజేపీ అగ్రనేత యడియూరప్ప, పార్టీ అధ్యక్షుడు విజయేంద్రతోపాటు నాయకులంతా ప్రచారంలోనే గడిపారు. మనవడి కోసం వయోభారాన్ని సైతం లెక్క చేయకుండా మాజీ ప్రధాని దేవేగౌడ మూడు రోజులుగా చన్నపట్టణలోనే మకాం వేశారు. కేంద్రమంత్రి కుమారస్వామి 25 రోజులుగా చన్నపట్టణను వీడలేదు. ఇలా సాగిన ప్రచారం ఒక్కసారిగా తెరపడినట్టయ్యింది. కాంగ్రెస్‌కు వక్ఫ్ బోర్డు నోటీసులు, ముడా ఇళ్ల వివాదం, వాల్మీకి కార్పొరేషన్ అవినీతి అంశాలు ఎదురుదెబ్బగా మారాయి. బీజేపీకి బసవరాజ్ బొమ్మై కుమారుడికే టిక్కెట్ ఇవ్వడం వారసత్వమంటూ విమర్శలు వచ్చాయి. అయితే కాంగ్రెస్‌కు ఐదు గ్యారెంటీలు బాగా కలిసొస్తున్నాయి.

సండూరు రారాజు ఎవరో..?

- కాంగ్రెస్ కంచుకోటలో కమలం బోణీ కొట్టేనా..?
- 15 సార్లు జరిగిన ఎన్నికల్లో 13 సార్లు హస్తగతం
- గాలి జనార్దన్‌రెడ్డి, సంతోష్ లాడ్ మధ్యే చాలెంజ్..



బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత

బళ్లారి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):ఇనుప ఖనిజం విస్తారంగా కలిగిన సండూరు అంటే తెలియని వాళ్లు ఉండరు. ఇనుము గనులతో పాటు ఇక్కడ ప్రకృతి సౌందర్యం కూడా ఎంతో ఆకట్టుకునే ప్రాంతం సండూరు. పూర్వం నుంచి సండూరు ప్రాచీన చరిత్ర కలిగిన ప్రాంతం, ఇక్కడ శివపార్వతులు, కుమారస్వామి, వినాయకులు నడియాడిన గడ్డగా ప్రతీతి. ఇక్కడ సాంప్రదాయాలు, సంస్కరణలకు పెట్టిన పేరు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన సండూరు లో శాసనసభ ఉప ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. ప్రధాన రాజకీయ పార్టీలు అయిన కాంగ్రెస్, బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో పోటీ మరింత రసవత్తరంగా మారింది. ఈనెల 13న సండూరు శాసనసభకు ఉప ఎన్నిక జరుగునుంది. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రస్తుత ఎంపీ. ఇ. తుకారాం భార్య ఇ. అన్నపూర్ణ రంగలో ఉంటే కమలం నుంచి బంగారు హనుమంతు పోటీలో ఉన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉండే కాంగ్రెస్ ఈ వారి అభ్యర్థులను గెలిపించుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. అభ్యర్థుల ఎంపిక, ప్రచారం, పంపకం ఇలా అన్నిటిలోనూ రెండు పార్టీలూ పోటాపోటీగా ఉన్నాయి. 2023లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ క్షేత్రం నుంచి బీజేపీ అభ్యర్థిగా మహిళ శిల్పా రాఘవేంద్రను పోటీలో నిలిపితే ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ మహిళ అయిన ఇ అన్నపూర్ణను బరిలో దించింది. అభ్యర్థుల ఎంపికలో రెండు పార్టీలూ కొత్త ఎత్తులే వేశాయి. సండూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి మంత్రి సంతోష్ లాడ్ ఎత్తులన్నీ వేస్తున్నారు. బీజేపీలో గాలి జనార్దన్‌రెడ్డి గెలుపు బాధ్యతన తన భుజస్కందాలపై వేసుకున్నారు.



కాంగ్రెస్ అభ్యర్థి ఇ.అన్నపూర్ణ

కాంగ్రెస్‌దే హవా

1957 నుండి 2004 వరకూ జనరల్ కేటగిరి కింద ఉన్న సండూరు 2008 ఎన్నికల్లో ఎస్టీ రిజర్వేషన్ అయింది. ప్రస్తుతం సండూరుకు 16వ సారి ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో 13 సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే ఒక దఫా జేడీఎస్, ఇంకోక దఫా 1985లో జేఎన్‌ఎస్ మినహా మిగిలిన అన్ని సార్లూ కాంగ్రెస్‌దే పైచేయిగా నిలిచింది. జేడీఎస్ నుంచి 2004లో గెలిచిన సంతోష్ లాడ్ కూడా ప్రస్తుతం కాంగ్రెస్ మంత్రిగా ఉన్నారు.

ఏ పార్టీ నుంచి ఎవరు గెలిచారంటే..

2023 తుకారాం(కాంగ్రెస్), 2018 ఇ. తుకారాం(కాంగ్రెస్), 2013 ఇ. తుకారాం (కాంగ్రెస్;) 2008 ఇ. తుకారాం.(కాంగ్రెస్), 2004 సంతోష్ లాడ్, జేడీఎస్, 1999 ఎంవై గోర్పడే (కాంగ్రెస) 1994 ఎంవై గోర్పడే(కాంగ్రెస్), 1989 ఎంవై గోర్పడే (కాంగ్రెస్) 1985 యు, భూపతి(జెఎన్‌పీ)1983 హిరోజీ బి.ఎస్ లాడ్, (కాంగ్రెస్); 1978 సీ. రుద్రప్ప,(కాంగ్రెస్), 1972 ఎం.వై గోర్పడే (కాంగ్రెస్); 1967 ఎంవై గోర్పడే. కాంగ్రెస్), 1962 మురార్ రావ్ యశ్వంత్‌రావ్ గోర్పడే,(కాంగ్రెస్) 1957 హెచ్ రాయన్న గైడ, (కాంగ్రెస్) ఇలా కాంగ్రెస్ ఆధిపత్యం ఉన్న సండూరులో ఈ సారైనా బీజేపీ విజయం సాధిస్తుందా లేదా అన్నది వేచి చూడాలి. ఇరు పార్టీల నేతలు గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఓటర్ల వివరాలు..

ఓటర్లు మొత్తం 2లక్షలా, 36 వేలా 402 మంది ఉన్నారు. వీరిలో మహిళలు 1 లక్ష 18 వేలా 438 మంది, పురుషులు 1లక్ష్యా 17వేలా 885 మంది, మిగిలిన వారు ఇతరులు ఉన్నారు.

బోర్ వెల్..!



బెంగళూరులోని జలమండలి కార్యాలయం

- నగరంలోని పలు కాలనీల్లో నీటి ఎద్దడి
- ఇంటింటా పెరిగిపోతున్న తాగునీటి బోర్లు
- భూగర్భజలాల గుర్తింపుకు మానిటరింగ్ సిస్టం
- 20 వార్డుల్లో జలమండలి అధ్యయనం

బెంగళూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐటీ నగరి రాజధాని బెంగళూరుకు కావేరి నది నుంచి నిరంతరం జలాలు వస్తున్నా బోర్‌వెల్‌ల ద్వారా ఆధారపడిన ప్రాంతాలు కోకొల్లలు. బెంగళూరు నగరం రెండు దశాబ్దాలలో ఊహించని విధంగా విస్తరించింది. పాత బెంగళూరు ప్రాంతాలకు గతంలో నిర్ణయించిన ప్రతిపాదనల ప్రకారం కావేరి నీటిని సమకూరుస్తున్నారు. కొన్నేళ్లక్రిందట విలీనమైన 110 గ్రామాలకు కావేరి ఐదో విడత ద్వారా నెలరోజులక్రితం నీరు మళ్లించారు. ఇంతవరకు బాగానే ఉన్నా నగర శివారు ప్రాంతాలు ఎలక్ట్రానిక్ సిటీ, వైట్‌ఫీల్డ్, సర్జాపుర, కనకపుర రోడ్డు, మైసూరు రోడ్డు, యలహంక ప్రాంతాలలో భారీగా అపార్ట్‌మెంట్‌లు వెలిశాయి. వీటికి బోర్ల ద్వారా మాత్రమే నీటిని సమకూరుస్తున్నారు. గత ఏడాది వర్షాలు కరువకపోవడంతో శివారు ప్రాంతాలలోని అపార్ట్‌మెంట్‌లకు నీటి సమస్య ఏర్పడింది. ఓ బిందె నీరు సమకూర్చుకునేందుకు తంటాలుపడిన పరిస్థితి దేశమంతటా చర్చనీయాంశమైంది. అపార్ట్‌మెంట్‌లలో విలాసవంతమైన జీవనం సాగించేవారు నీరులేక హోటళ్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన సందర్భాలు చోటు చేసుకున్నాయి.

నగరంలో భూగర్భజలం ఏ రీతిలో అందుబాటులో ఉంది అనే అంశం తెలుసుకునేందుకు జలమండలి సిద్ధమయ్యింది. బోరుబావుల్లో నీటిమట్టాన్ని పర్యవేక్షించేందుకు ఏఐ ఆధారిత రియల్‌టైం మానిటరింగ్ సిస్టమ్‌ను నగర పరిధిలోని బోర్‌వెల్స్‌కు అమర్చేందుకు సిద్ధమయ్యారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్‌సీ)తో జలమండలి ఒప్పందం చేసుకుంది. తొలి విడతగా నగర పరిధిలో 20 వార్డుల్లో భూగర్భజలంపై అధ్యయనం ప్రారంభించారు. గత ఏడాది పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఈ విధానం తీసుకొచ్చారు.

నగరంలో 198 వార్డుల్లో బోరుబావుల్లో భూగర్భజలం ఏ విధంగా అందుబాటులో ఉందనేది పర్యవేక్షించనున్నారు. వర్షాకాలంలో ఎన్ని అడుగుల్లో నీరు లభించనుంది, ఆ తర్వాత నెలల వారీగా మార్పులను పరిశీలించాలని నిర్ణయించారు. ఒక వ్యక్తికి రోజుకు 135 లీటర్ల నీరు అవసరంగా ఉంది. ప్రస్తుతం నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో 110 ఎల్‌పీసీడీ (లీటర్ ఫర్ పర్సన్ పర్ డే), కొన్ని వార్డుల్లో 30ఎల్‌పీసీడీలు మాత్రమే సాధ్యమవుతోంది. బెంగళూరు తూర్పు పరిధిలో భూగర్భజలంపై ఐఐఎస్‌సీ మూడు నెలలపాటు అధ్యయనం చేయనుంది. ఈ 20 వార్డులలో ఎంతమేరన నీరు లభిస్తుంది. వర్షాకాలం తర్వాత నెలల వారీగా ఎన్ని అడుగుల లోతుకు తగ్గిపోతుందనేది పరిశోధన చేయనున్నారు. 20 వార్డుల పరిశోధనలు ముగిశాక దయానందసాగర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ద్వారా నగరవ్యాప్తంగా భూగర్భజలంపై సర్వే చేయదలిచారు. అందుకోసం విద్యార్థులకు ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వదలిచారు. నివేదిక ఆధారంగా నీటి అవసరాలు ఏ విధంగా సమకూర్చాలనేది పర్యవేక్షిస్తారు.

ఒక బోర్‌వెల్‌కు రియల్‌టైం మానిటరింగ్ సిస్టమ్‌ను అమర్చేందుకు కనీసం రూ.50వేలు ఖర్చు కానుంది. ప్రస్తుతం నగరంలో 11,800 బోరుబావులు పనిచేస్తున్నాయి. అన్ని బోరుబావులకు సిస్టమ్ అమర్చాలంటే కోట్లాది రూపాయలు ఖర్చు కానుంది. జలమండలికి ఇది భారీ ఆర్థికభారం కానుంది. బెంగళూరు ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ విభాగాలలో అంచెలంచెలుగా టెండర్ల ద్వారా అమలు చేయదలిచారు.

ఐఐఎస్‌సీకి రూ.22 లక్షలు

ప్రస్తుతం ఈ సాంకేతిక విధానాన్ని పరిశోధనలకోసం ఐఐఎస్‌సికి 22 లక్షల రూపాయలు కేటాయించారు. అందులో రూ.11లక్షల రూపాయలు ఇప్పటికే విడుదల చేశారు. ఐఐఎస్‌సీ పరిశోధకులు బోరుబావులలో రియల్‌టైం మానిటరింగ్ సిస్టమ్ ద్వారా ఏఐ సాంకేతికత పరికరాన్ని బోర్‌వెల్‌లో అమర్చి నిర్దిష్ట వ్యవధిలో ఎంతమేర నీరు సమకూరుతుంది. ఎన్ని అడుగులలో నీరు ఉంది, ఎంతమేర తగ్గదదల, పెరుగుదల సాధ్యమని పర్యవేక్షించనున్నారు. రియల్‌టైమ్ సిస్టం నివేదికకు అనుగుణంగా నీటిని సమకూర్చనుంది.

నాలుగు నెలల్లో సాంకేతికత అమలు

బెంగళూరు వ్యాప్తంగా 2025 మార్చి నాటికి రియల్‌టైం మానిటరింగ్ సిస్టమ్‌ను అమలు చేయదలిచామని జలమండలి చైర్మన్ డాక్టర్ వి రామ్‌ప్రసాత్ అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోనే ఇది తొలి ప్రయత్నమన్నారు. తద్వారా వేసవి, వర్షాలు లేని కాలంలో నిర్దిష్టంగా ఏ ప్రాంతాలలో భూగర్భజలమట్టం తగ్గుతుందనేది తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు.



మునిరాబాద్ సమీపంలో



హొసళ్ళి క్రాస్ వద్ద..

తుంగభద్ర పరీవాహకమంతా పచ్చదనమే..!

బళ్లారి గాంధీనగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బళ్ళారి, కొప్పళ, రాయచూరు ప్రాంతాల రైతుల జీవనాడిగా నిలిచిన తుంగభద్ర ఆయకట్టు ప్రాంతమంతా పచ్చదనంతో కళకళలాడుతోంది. అంతరాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుగా నిలిచిన తుంగభద్ర జలాశయం నుండి కాలువల ద్వారా ప్రవహిస్తున్న సాగునీరు ఆయకట్టు ప్రాంతాల భూములను సస్యశ్యామలం చేసింది. ఈ రిజర్వాయర్ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల సాగు, తాగునీటి ప్రయాజనాన్ని అందిస్తోంది. కొప్పళ, బళ్లారి, విజయనగర జిల్లాలోని పదుల సంఖ్యలో ఇనుము, ఉక్కు, సిమెంటు కర్మాగారాలకు ఇది నీటి ఆధారం. తుంగభద్ర ఆయకట్టు ప్రాంతాలకే సొంతం. మునిరాబాద్ సమీపంలో హొలింగాపురం నుండి బూదిగుంప గ్రామం వరకు జాతీయ రహదారి-50కి ఇరువైపులా కంటిచూపు మేర పచ్చనివరిపైర్లే కనువిందు చేస్తున్నాయి. హొసలింగాపుర, హొహళ్ళి వద్ద కొబ్బరితోటల నముడ కనిపిస్తున్న సూర్యోదయం, సూర్యాస్తం దృశ్యాలు హొసళ్ళి క్రాస్, హిట్నాళ్ రైల్వే వంతెన, శహాపుర గ్రామాల వద్ద కనిపించే దృశ్యాలు నయన మనోహరమని చెప్పవచ్చు. ప్రయాణికులు సుందరమైన దృశ్యాలకు మైమర్చిపోయి ఫొటోలు తీసుకుంటున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృతి

మడకశిర, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద మధుగిరి ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృతిచెందింది. రోడ్డు పక్కనే చిరుత కళేబరాన్ని సోమవారం గుర్తించారు. రహదారి పక్కనే చిరుత కళేబరాన్ని చూసి అటుగా వెళ్లినవారు అటవీ అధికారులకు సమాచారం అందించారు. జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) చక్రపాణి, సబ్ డీఎఫ్ఓ ఆనంద్, రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని, చిరుత మృతికి కారణాలపై ఆరాతీశారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృతిచెందినట్లు భావిస్తున్నామని డీఎఫ్ఓ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక మేరకు విచారణ చేపడతామన్నారు.



చిరుత కళేబరం

సంక్షిప్తం

కార్తీక సోమవారం పూజలు



అలంకరణలో దోనరామేశ్వర స్వామి

శింగనమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక మాస రెండో సోమవారం సందర్భంగా మండలంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నజలాలపురం దోనరామేశ్వరా స్వామి, శింగనమల ఆత్మ సీతరాముల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సాయంత్రం దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు గో, వృషభ కల్యాణం

అనంతపురం కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పశువులు, పాడిపంటల వృద్ధిని కాంక్షిస్తూ సాయి ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం గోమాత వృషభరాజ కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. జిల్లాకేంద్రంలో హెచ్చెల్సీ కాలనీలో ఉన్న వలీస్వామి ఆశ్రమంలో నిర్వహిస్తున్నట్లు సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు పాండురంగ పాద స్పర్శదర్శనం

అనంతపురం కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాస శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో నిజపాద స్పర్శదర్శనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు భావసార క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు తిరుపతిరావు, ఆనంద్ సోమవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు విరివిగా తరలిరావాలని వారు కోరారు.

18న వ్యక్తిగత అర్జీల కార్యక్రమం

నార్పల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యంలో ఈ 18వ తేదీన నిర్వహించే వ్యక్తిగత అర్జీల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పెద్దయ్య, సీపీఐ మండల కార్యదర్శి సాకే గంగాధర కోరారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయం వద్ద అర్జీల కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి చాపల రామాంజి, సీనియర్ నాయకులు నాగరాజు, సుధాకర్, నారాయణప్ప, గూగూడు యంగపప, శీనా, రఫీ పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠకు రండి

చెన్నేకొత్తపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లిలో బుధవారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు వాల్మీకి కులస్థులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్ఠలో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సీతారాముల కల్యాణం నిర్వహిస్తామన్నారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. వాల్మీకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

బైకు ఢీ కొని వృద్ధుడి మృతి

అనంతపురం క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం ఢీ కొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. నగర శివారులోని రాచానపల్లికి చెందిన సుబ్బరాయుడు(78) సిండికేట్‌నగర్ సమీపంలో సోమవారం ఉదయం రోడ్డు దాటుతుండగా ఓ ద్విచక్రవాహనం ఢీ కొంది. దీంతో తీవ్ర గాయాలకు గురైన ఆ వృద్ధుడు మృతి చెందాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

గార్లదిన్నె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో సోమవారం మెహరున్నీ (63) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. యర్రగుంట్లకు చెందిన జాఫర్‌సాబ్, మెహరున్నీ దంపతులు కూలీపనులు చేసుకుని జీవనం సాగించేవా రు. మెహరున్నీ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేది. సోమవారం కడుపు నొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. ఇంటికి వచ్చిన భర్త, కుటుంబ సభ్యులు గమనించి అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కనగానపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. మండలంలోని దాదులూరులో బెల్టు షాపులో నిల్వ ఉంచిన 16 మద్యం బాటిళ్లను పట్టుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ ఎస్‌ఐలు అలీబేగ్, ఫరూక్ ఆజం తెలిపారు. మద్యాన్ని విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి, మద్యం బాటిళ్లను సీజ్ చేశామన్నారు.

ఐదుగురిపై కేసు

గార్లదిన్నె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కనుంపల్లిలో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కనుంపల్లిలో వీరాంజినేయులు, నాగేంద్రకు, రామాంజినేయులు, నాగరాజు, నాగభూషణకు పొలం వద్ద వారం రోజుల క్రితం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు సోమవారం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్డీటీ భవనంలో ప్రభుత్వ పాఠశాల

- ఒకే గదిలో ఐదు తరగతులు
- శిథిలావస్థలో పాఠశాల భవనం



ఒకే గదిలో చదువుకుంటున్న ఐదు తరగతుల విద్యార్థులు

గార్లదిన్నె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ళ పాటు నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చి దిద్దామని ఉపన్యాసాలు హోరెత్తించింది. నాడు-నేడుతో విద్యార్థులకు అన్ని సౌకర్యాల నడుమ నాణ్యమైన విద్యను అందిస్తున్నామని గొప్పలు చెప్పింది. వైసీపీ ప్రభుత్వం నాటి మాటలు నీటి మూటలేనని అనడానికి మండలంలోని కల్లూరు ఆగ్రహారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నిదర్శనంగా నిలుస్తోంది. కల్లూరు ఆగ్రహారంలోని ప్రాథమిక పాఠశాలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 50 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో ఇద్దరు టీచర్లు



పెచ్చులూడిన ప్రభుత్వ పాఠశాల పైకప్పు

విద్యను బోధిస్తున్నారు. అయితే పాఠశాల పై భాగం పూర్తిగా పెచ్చుటూడి శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థులు భయం గుప్పిట్లో విద్యను కొనసాంచేవారు. అయినా నాడు-నేడు ఫేస్-1 , ఫేస్-2లో సైతం ఈ పాఠశాల మరమ్మతులు చేపట్టకపోవడం విడ్డూ రం. వైసీపీ ఐదేళ్ల పాలనలో శింగనమల నియో జకవర్గానికి జొన్నలగడ్డ పద్మావతి ఎమ్మెల్యేగా కొనసాగారు. ఆమె ఏనాడూ ఈ పాఠశాల వైపు కన్నెత్తి చూసిన పాపన పోలేదని పలువురు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్థితిలవస్థకు చేరుకున్న భనవంలో విద్యార్థులకు ప్రమాదం పొంచిఉందని భావించిన విద్యాశాఖ అధికారులు సమీపంలో ఉన్న ఆర్డీటీ భవనంలో కి పాఠశాలను మార్చారు. అయితే ఒకే గది ఉండటంతో, అందులోనే ఐదు తరగతులకూ ఆ ఇద్దరు ఉపాధ్యాయినులు బోధిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి పాటుపడలేదని ఏన్డీఏ ప్రభుత్వమైనా తమ అందుకు కృషి చేయాలని ఆ గ్రామ ప్రజలు, విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

కల్లూరు ఆగ్రహారంలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పై కప్పు పెచ్చులూడి పడుతోంది. ప్రమాదం జరుగుతుందని ముందస్తు జాగ్రత్తగా సమీపంలో ఉన్న ఆర్డీటీ భనవంలో పాఠశా లను నిర్వహిస్తున్నాం. ఈ విషయాన్ని ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- తారా చంద్రానాయక్, ఎంఈఓ, గార్లదిన్నె

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బంగి నాగ తదితరులు



సైపుద్దీన్ తదితరులు

అనంతపురం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్‌లో ఎస్సీల సంక్షేమం కోసం భారీగా నిధులు కేటాయించినందుకు తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగి నాగ ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్థానిక హమాలీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల వద్ద సోమవారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషే కం చేశారు. దళిత సంఘాల నాయకులు పృథ్వి, అనిల్ కుమార్, శరత్, రాజేష్, విద్యాసాగర్, మురళి, సాయి శంకర్, సాయి వర్ధన్, పవన్, భరత్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే బడ్జెట్‌లో మైనార్టీలకు నిధులు కేటాయించినందుకు సోమవారం సాయంత్రం టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైఫుద్దీన్ ఆధ్వర్యంలో స్థానిక సప్తగిరి సర్కిల్ మసీదు వద్ద సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు.

స్వర్ణాంధ్రకు బాటలు వేసేలా బడ్జెట్

అనంతపురం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్ స్వర్ణాంధ్రకు బాటలు వేసే విధంగా ఉందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, టీడీపీ బీసీ సెల్ నాయకులు సిమెంట్ పోలన్న, నాయకులు కురబ నారాయణస్వామి, నెట్టెం బాలకృష్ణ, కూచి హరి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా బడ్జెట్ ఉందని కొనియాడారు. సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్‌లు నిధులు కేటాయించడం శుభపరిణామం అన్నారు. ఈ బడ్జెట్‌లో ఏపీ చరిత్రలో ఓ మైలురాయిగా నిలుస్తుందన్నారు.

ఎస్ఈ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఎస్ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, నవంబరు11: ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈగా గుంటూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈగా పనిచేస్తున్న సురేష్‌ను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్ కుమార్ నుండి నెలన్నర క్రితం ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. అయితే ఉత్తర్వులు జారీ అయి నెలన్నర కావస్తున్నా బాధ్యతలు చేపట్టడానికి రాకపోవడంతో ఇక్కడ ఉన్న ఈఈ మురళీధర్‌రావుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఎస్ఈ సురేష్ రాకుంటే పదోన్నతి ప్రక్రియ చేపట్టినప్పుడు ఈఈలుగా ఉన్న వారిలో మరొకరిని నియమించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఎట్టలకేలకు ఎస్ఈ సురేష్ బాధ్యతలు చేపట్టారు. దీంతో పలువురు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

చిత్రకళ ఉపాధ్యాయుడికి విశిష్ట గౌరవం



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు

రామగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గురుకుల పాఠశాల చిత్రకళ ఉపాధ్యాయుడు శ్రీరాములుకు విశిష్ట గౌరవం లభించింది. విజయవాడకు చెందిన ఓ పత్రిక 64 కళల డాట్‌కాం వ్యవస్థాపకుడు కళాసాగర్ రూపొందించిన ఆర్ట్ ఆఫ్ ఏపీ పుస్తకంలో తన పేరు పొందుపరిచినట్లు ఆయన సోమవారం తెలిపారు. విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండల బుద్ధప్రసాద్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీరాజ్ చేతులమీదుగా ఈ పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. దీంతో ఆయనకు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- ఆస్పత్రిలో చేర్పించిన డీఎస్పీ



గాయపడ్డ చిన్నారి వద్ద డీఎస్పీ

పుట్టపర్తి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడ్డ తండ్రి కొడుకులను హిందూపురం డీఎస్పీ మహేష్ తన వాహనంలో సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించి.. మానవత్వం చాటుకున్నాడు. అనంతపురానికి చెందిన దేవేంద్ర, అతని కుమారుడు శరత్ సోమవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా.. కొత్తచెరువు- గోరంట్ల మార్గంలో గంటల మారెమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నారి శరత్ తీవ్రంగా, దేవేంద్ర స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో పుట్టపర్తికి వస్తున్న హిందూపురం డీఎస్పీ మహేష్ తన వాహనంలో ఆ తండ్రీ కొడుకులను తీసుకెళ్లి.. సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వారిద్దరిని అనంతపురానికి తరలించారు. పుట్టపర్తి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మహిళల గొడవ.. కేసు నమోదు

అనంతపురం క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చిట్టీ లెక్కల వ్యవహారంపై రెండు వర్గాలకు చెందిన మహిళలపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రూ. 90 వేల చిట్టీకి సంబంధించి మూడు కంతులు చెల్లించలేదంటూ... అంబేడ్కర్ నగర్‌కు చెందిన బాల కదిరమ్మ, ప్రమీల వర్గాలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో వాగ్వాదానికి దిగారు. చివరకు గొడవ పడే పరిస్థితి వచ్చింది. దీంతో పోలీసులు ఇరువర్గాలకు చెందిన ఐదు మందిపై కేసు నమోదు చేశారు.

రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం



స్వామికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేట రామాలయం ఆవరణలో ఉన్న రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ముత్యాలురెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ప్రాంతాల్లో పోలీసుల గస్తీ

శింగనమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో పెన్నానది వంక ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను తరలించకుండా రెవెన్యూ సిబ్బందితో కలసి పోలీసుల గస్తీ ఏర్పాటు చేశారు. మండలంలోని వంక ప్రాంతాలల్లో అక్రమ ఇసుక తరలింపుపై ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ శరత్ చంద్ర పలు గ్రామాల్లోని వంక ప్రాంతాల్లో పోలీసుగస్తీతో పాటు రెవెన్యూ సిబ్బందిని కాపాలా ఉంచారు.

ఇసుక రవాణాను అరికట్టండి

గార్లదిన్నె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొప్పలకొండ గ్రామం నుంచి ఇసుక అక్రమ రవాణాను ఆరికట్టి ఊటకాలువను కాపాడాలని కేశవాపురం గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ బండారు ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఊటకాలువల ద్వారా నీరు రాకపోతే కేశవాపురం గ్రామంలో సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు క్రిష్టయ్య, ప్రకాష్‌నాయుడు, అంజినేయులు, రామాంజినేయులు, పెద్దన్న, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె విద్యార్థుల ప్రతిభ

గార్లదిన్నె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మౌలానా అబుల్ కలామ్ జయంతి వేడుకలను పురష్కరించుకుని సోమవారం అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అబుల్ కలామ్‌పై ప్రసంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గార్లదిన్నె ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న బషీరుద్దీన్, ఎనిమిదో తరగతి చదువుతున్న సాహిద్ అర్ఫాన్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వారికి కలెక్టర్ బహుమతులు అందచేశారు.

అబుల్ కలాంకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని సోమవారం టీడీపీ నాయకులు ఆయనకు ఘన నివాళులర్పించారు. సోమవారం స్థానిక క్లాక్ టవర్ సమీ పంలోని మౌలానా విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, నాయకులు సైఫుద్దీన్, ఫిరోజ్ అహ్మద్, తాజుద్దీన్, సరిపూటి రమణ, కురబ నారాయణస్వామి, మణికంఠ బాబు, ఓంకార్‌రెడ్డి, సరిపూటి శ్రీకాంత్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రత్యేక చొరవతోనే క్లాక్‌టవర్ సమీపంలో అబుల్ కలాం విగ్రహాన్ని తిరిగి ఏర్పాటుచేసినట్లు వారు పేర్కొన్నారు.

● అనంతపురం క్లాక్‌టవర్: ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిన నాయకుడు దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక పాతూరులోని మున్సిపల్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాఠశాలలో పేద విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నసీమా, సొసైటీ కార్యదర్శి షేక్ చాందిని, సహాయ కార్యదర్శి ప్రసిల్లా, సభ్యులు మహేంద్ర, దివ్యతేజ తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం న్యూటౌన్: మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలు సోమవారం కాంగ్రెస్ పార్టీ స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీ ఆధ్వర్యంలో చేపట్టారు. అబుల్ కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ ఇమామ్, సీనియర్ నాయకులు వాసు, ఎన్ఎస్‌యూఐ నాయకులు నరేష్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యాసామగ్రి అందజేస్తున్న ఎస్ఆర్ సొసైటీ సభ్యులు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అదృశ్యమైన వస్తువులు ప్రత్యక్షం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



డ్వామా పీడీ బంగ్లా ఇదే...

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల డ్వామా పీడీ కార్యాలయంలో, పీడీ బంగ్లానుంచి అదృశ్యమైన వస్తువుల్లో కొన్ని వచ్చి చేరాయి. మూడు రోజుల క్రితం అర్ధరాత్రి ఎవరూ లేని సమయంలో రెండు ఏసీలు, టీవీ, ఫర్నీచర్‌ను డ్వామా పీడీ బంగ్లాలోకి ఎవరో తెచ్చి పెట్టారని ఆశాఖ వారే అంటున్నారు. అయితే మొత్తం డ్వామా పీడీ కార్యాలయం, బంగ్లాలో నుంచి ఇటీవల ఎనిమిది ఏసీలు, రూ.10లక్షలకు పైగా విలువ చేసే ఫర్నీచర్‌ను ఎవరో ఎత్తుకెళ్లారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ' మరీ ఇంత కక్కుర్తా... డ్వామాలో దొంగలుపడ్డారు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో విషయం బయటకు పొక్కడం వల్ల వాటిలో కొన్నిటిని తిరిగి చేర్చారు. ఈ తతంగంలో కీలకంగా ఓ ఉద్యోగి ఉన్న ట్లు ఆ శాఖలో అందరూ చర్చించుకుంటున్నారు. కొత్తగా వచ్చిన పీడీకి తెలియ కుండానే కీలక ఉద్యోగి ఇవన్నీ చేశారని చెబుతున్నారు. అయితే అతడికి ఎందుకు ప్రాధాన్యం ఇస్తున్నారనేది తోటి ఉద్యోగుల్లో సందేహం. డ్వామా పీడీ బంగ్లాలోని ఏసీలు, ఫర్నీచర్ తెచ్చిపెట్టారు కానీ... పీడీ కార్యాలయం, కాన్ఫరెన్స్‌హాల్‌లో నుంచి తీసుకెళ్లిన ఏసీలు, ఇతర ఫర్నీచర్ ఎవరి వద్ద ఉన్నాయో తేలాల్సిఉంది.

డిప్యూటీ సీఎం ఫొటో ఎక్కడ..?

- కమిషనర్‌తో జనసేన నాయకులు
- వెంటనే ఏర్పాటు

అనంతపురం క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటో ఎందుకు ఏర్పాటు చేయలేదని జనసేన నాయకులు నగరపాలిక అధికారులను ప్రశ్నించారు. సోమవారం రాత్రి జనసేన పార్టీకి చెందిన కొందరు నాయకులు నగర కమిషనర్ చాంబర్ వద్దకెళ్లి నిలదీశారు. విషయం తెలుసుకున్న కమిషనర్ నాగరాజు తన చాంబర్‌లోకి పిలిపించి మాట్లాడారు. దీంతో వారు మాట్లాడుతూ... తమ నాయకుడు, అహుడా చైర్మన్‌గా నియమితులైన టీసీ వరుణ్ ఫ్లెక్సీలను కొన్నింటిని ఎందుకు తొలగించారని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఫ్లెక్సీలు ట్రాఫిక్‌కు, ప్రయాణికులకు ఇబ్బందిగా ఉన్న కారణంతో తొలగించాని సంబంధిత అధికారులు చెప్పారు. అనంతరం కమిషనర్ చాంబర్‌లో సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటో ఎందుకు పెట్టలేదని వారు అడిగారు. పెట్టిస్తామని కమిషనర్ చెప్పడంతో వారు వానుదిరిగారు. కొంతసేపటికే కమిషనర్ స్పందించి డిప్యూటీ సీఎం ఫొటోను సీఎం ఫొటో పక్కనే పెట్టించారు.

నేటి నుంచి ధర్మవరం డివిజన్‌లో గ్రామ సభలు

- ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మవరం నియోజకవర్గంతో పాటు రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోనూ గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ఆర్‌డీఓ, తహసీల్దార్, ఇతర మండల అధికారులు గ్రామ సభలకు హాజరవుతారన్నారు. గ్రామాల్లో సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలపై సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

స్కిల్ సర్వే నుంచి తప్పించండి

- వీఆర్‌ఓల వినతి

నార్పల/ రాప్తాడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్ మెంట్ సర్వే విధుల నుంచి తమను తొలగించాలని మండలంలోని వీఆర్‌ఓలు కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అరుణకుమారికి వినతి పత్రం అందజేశారు. అలాగే రాప్తాడు మండలంలోని వీఆర్‌ఓలు సోమవారం తహసీల్దార్‌కు విజయకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పలు అదనపు విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పుడు ఉన్నతాధికారులు స్కిల్ డెవెలప్‌మెంట్ సర్వేతో వీఆర్వోలను భాగస్వామ్యం చేయడం భావ్యం కాదన్నారు. నార్పలలో వినతి పత్రం ఇచ్చిన వారిలో మండల వీఆర్వోలు శివరాం, పెద్దన్న, వెంకోబరావు, వంశీకృష్ణారెడ్డి, కొండయ్య, రామాంజినేయులు, నిరంజన్‌రావు, చంద్ర, సుకన్య, ప్రభావతి, గాయత్రి, మౌనిక, కీర్తి తదితరులు పాల్గొన్నారు. రాప్తాడులో వీఆర్‌ఓలు లక్ష్మీనారాయణచౌదరి, సరస్వతి, రవికిరణ్, గీతారాణి, శిరీష, ఖుర్దూస్, మనోజ్‌సాయి పాల్గొన్నారు.

నేడు వైద్యకళాశాలలో ఫ్రెషర్స్‌డే

అనంతపురంటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : వైద్యకళాశాల 2024 వైద్యవిద్యార్థుల ఫ్రెషర్స్‌డేకు అతిథులను ఆహ్వానిస్తూ సోమవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణంలో మెడికోలు చేపట్టిన ఫ్లాష్‌మాబ్ అందరినీ ఆకట్టుకుంది. మెడికోలు నృత్యరూపంలో డాన్సులు వేస్తూ అతిథులను స్వాగతించారు. వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యాలరావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపర్‌స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని మెడికోల స్వాగత నృత్యాలు వీక్షించారు. ఫ్రెషర్స్‌డేను వైద్యకళాశాల ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెద్దన్న పోరాటాలు చిరస్మరణీయం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్మికులు, కర్షకుల సమస్యలపై పెద్దన్న చేసిన పోరాటాలు చిరస్మరణీయమని ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా పేర్కొన్నారు. సీపీఐ ఎంఎల్ మాజీ జిల్లా కార్యదర్శి పెద్దన్న స్మారక స్థూపం నిర్మాణ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రజకనగర్‌లో ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా ప్రారంభించారు. వివిధ సంఘాల నాయకులు చంద్రశేఖర్, మల్లేశ్వరి, సుధాకర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రబీకి పెట్టుబడి సాయం అందించాలి

నార్పల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పెట్టుబడి రాయితీ అన్నదాత సుఖీభవ కింద రైతులకు తక్షణమే రూ. 20వేలు సాయం అందించాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు మాబు, సంజీవరాయుడు, నరసింహారెడ్డి, శ్రీదేవి, రమణారెడ్డి, రసూల్‌బీ, తదితరులు పాల్గొన్నారు.

● చెన్నేకొత్తపల్లి : మండలంలో పంటలను నష్టపోయిన రైతుల ను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం రైతుసంఘం నాయకులతో కలిసి తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం నాయకులు టి. ముత్యాలప్ప, ముత్యాలప్ప, రాము, నాగరాజు పాల్గొన్నారు.

● రాప్తాడు: రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం అందచేశారు. రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు చలపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరాముడు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

శింగనమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి నేసే మధు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సాకే బ్రహ్మయ్యకు ఆయన చేనేత కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు మధుయాదవ్, చేనేత సంఘం నాయకులు శివశంకర్, గురు, నరసయ్య, దస్తగిరి, ముధురెడ్డి, రమణ తదితరులు పాలొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సీకేపల్లి విద్యార్థులు




ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు చెన్నేకొత్తపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ నల్లప్ప తెలిపారు. ఇటీవల కొత్తచెరువులో నిర్వహించిన అండర్-14,17 జిల్లా స్థాయి పోటీల్లో వారు ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఖోఖో బాలికల విభాగంలో హర్షిణి (అండర్- 14), మధుమిత (అండర్-17), ఉష క్రీడలో చరణ్‌తేజ(అండర్-17) రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. హెచ్ఎం ఓబుళమ్మ, పీడీలు నల్లప్ప, విజయనిర్మల, ఉపాధ్యాయులు వారిని సోమవారం అభినందించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కొప్పరపు వేంకట సుబ్బరాయకవి (జయంతి)




తెలుగు సాహిత్య అవధానంలో పేరొందిన జంట సోదర కవులు కొప్పరపు సోదరులు. వీరిలో పెద్దవాడు కొప్పరపు వేంకట సుబ్బరాయ కవి 1885 నవంబరు 12న గుంటూరు జిల్లా అద్దంకి తాలూకా కొప్పరం గ్రామం (ప్రస్తుతం ప్రకాశం జిల్లా)లో జన్మించారు. 16ఏళ్లు నిండకనే సోదరులు ఆశుకవిత్వాన్ని ప్రదర్శించి పేరొందారు. 1908 నుంచి అసంఖ్యాక అష్టావధానాలు, శతా వధానాలు చేసి 'కవిత పుట్టిల్లు సోదరకవుల ఇల్లు' అనే ఖ్యాతి పొందారు. ప్రబంధ శైలిలో గంటకు 500 పద్యాలు చెప్పేవారు. మార్టేరు సభలో పందెం వేసి గంటకు 720 పద్యాల లెక్కన అరగంటలో మను చరిత్రను ఆశువుగా చెప్పినట్టు తెలుస్తోంది. ఆశు కవీంద్ర సింహ, ఆశుకవి చక్రవర్తి, కవిరత్న, కథాశు కవీశ్వర, ఆశుకవి శిఖామణి తదితర బిరుదులు ఉన్నా యి. 1932 మార్చి 29న కన్నుమూశారు.

మదన్ మోహన్ మాలవీయ (వర్ధంతి)



'సత్యమేవ జయతే' నినాదాన్ని వ్యాపింప చేసిన ప్రముఖ విద్యావేత్త, కర్మయోగిగా పేరొం దిన పండిట్ మదన్ మోహన్ మాలవీయ (మాలవ్య) 1861 డిసెంబరు 25న అలహాబాద్‌లో జన్మించారు. అఖిల భారతీయ హిందూ మహాసభ సంస్థాపకుడు. వారణాసిలో 'బెనారస్ హిందూ యూనివర్శిటీ' వ్యవస్థాపకులు. విశ్వవిద్యాలయానికి వైస్ చాన్స్‌లర్‌గా సుదీర్ఘకాలం వ్యవహరించారు. ఆసియా లోనే అతిపెద్ద రెసిడెన్షియల్ విశ్వవిద్యా లయంగా గుర్తింపు పొందింది. భారత జాతీయ కాంగ్రెస్‌కు 4సార్లు అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1946 నవం బరు 12న కన్నుమూశారు. 2015లో మరణానంతర అత్యున్నత 'భారతరత్న' పురస్కారం ప్రకటించారు.

అనంతకుమార్ (వర్ధంతి)



బెంగళూరు దక్షిణ నుంచి ఎంపీగా ఎన్నికై కేంద్రమంత్రిగా వివిధ హోదాలలో కొనసాగిన హెగ్గనహళ్ళి నారాయణశాస్త్రి అనంతకుమార్ 1959 జూలై 22న బెంగళూరులో జన్మించారు. ప్రత్యే కించి పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా, రసాయన, ఎరువుల శాఖ మంత్రిగా గుర్తింపు పొం దారు. బీజేపీ కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవ హరిం చారు. దేశవ్యాప్తంగా జన ఔషధి కేంద్రాలను, వేప లేపనంతో యూరియా, పర్యావరణ స్నేహి ఎరు వుల ను అందుబాటులోకి తెచ్చిన ఘనత ఆయనదే. సంసద్ ఆదర్శ గ్రామ యోజన కింద రాగిహళ్ళి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. 2018 నవంబరు 12న కన్నుమూశారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు



నాగనాథేశ్వరస్వామికి పూజలు



మల్లేశ్వరంలో



చేళూరులో విశేషపూజలు



బిల్వార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

మంజునాథస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన

బొమ్మనహళ్ళి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లో వెలసిన శాంతిధామలోని మంజునాథస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా జరిగాయి. సాయంత్ర 4.30 నుంచి సుమారు మూడు గంటలపాటు కార్యక్రమం కొనసాగింది. 36మంది దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఓం నమఃశ్శివాయ జపం చేశారు. ఏటా కార్తీక మాసంలో బిల్వార్చన నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడా రామకృష్ణ వెల్లడించారు. ఈసారి త్రిదళ బిల్వ పత్రాలను సునితా, సంతోష్‌లు సమకూర్చాడని వివ రించారు. కాగా ఈనెల 22న వెండి దీపాన్ని బహూ కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. మేడా రామకృష్ణ కుటుంబీ కులు, తాతయ్య గుప్త, మనోహర్ గుప్త, కృష్ణయ్యశెట్టి, టీవిజి గుప్త, సత్యనారాయణశెట్టి తదితరులు, వలంటీర్‌లు, సేవాదళ్ భక్తులు పాల్గొన్నారు.



అరికెరెలో మంజునాథస్వామికి బిల్వార్చన

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట: కార్తీకమాసం రెండో సోమవారం పురస్కరిం చుకుని శిడ్లఘట్టతోపాటు తాలూకా వ్యాప్తంగా పరమే శ్వరుడికి విశేషపూజలు కొనసాగాయి. పట్టణంలోని నాగనాథేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి ఆలయంలోనూ, చంద్రశేఖరస్వామి, తాలూకాలోని గవిగుడ్డ గంగాధరేశ్వర స్వామి ఆలయంలోనూ, ఇతర ఆలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చేళూరులో...

చేళూరు: చిలకలనేర్పు నివాసులు అవినట్టి నారాయణ రావు కుటుంబీకుల ఆధ్వర్యంలో సద్గురు యోగీశ్వర యాజ్ఞ వల్క్య మందిరంలో సోమవారం విశేషపూజలు జరిగాయి. యాజ్ఞవల్క్య జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవ త్సరం ఒక్కో కుటుంబం బాధ్యత నిర్వహిస్తోంది. విశేష పూ జల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాగా బెంగ ళూరులోని మల్లేశ్వరంలోని కాడుమల్లేశ్వర ఆలయం, గవి గంగాధరేశ్వర తదితర ఆలయల్లో భక్త రద్దీ కనిపించింది.



కాడుమల్లేశ్వర ఆలయంలో దీపోత్సవంలో భక్తులు

15నుంచి మల్లేశ్వరంలో వేరుశనగ పరుష

బెంగళూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కాడుమల్లేశ్వర గెళెయర బళగ ఆధ్వర్యంలో ఈనెల 15నుంచి మల్లేశ్వరంలో వేరుశనగ పరుష జరుగనుంది. ఏటా కార్తీకమాసంలో వేరుశెనగ పరుషను నిర్వహించే ఆనవాయితీ ఉంది. సంఘం పదాధికారులు సోమవారం మీడియాతో మాట్లాడుతూ సంప్రదాయాలను భావి తరాలకు అందించడంలో భాగంగా కొనసాగిస్తున్నామన్నారు. మూడు రోజులపాటు పరుష కొనసాగుతుందని, పౌర్ణమి రోజున ఆలయంలో విశేషపూజలు, ధార్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. పరుషలో భాగంగా కార్తీక పౌర్ణమికి శుక్రవారం రాత్రి దీపాలు వెలిగిస్తారన్నారు. జాతరను రైతు స్నేహిగా ఆచరించదలిచామని, ప్లాస్టిక్ కవర్ల వాడకం లేకుండా బట్ట సంచీలు అందుబాటులో ఉంచామన్నారు. సాంస్కృతి క కార్యక్రమాలను కూడా అర్థవంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పర్యావరణ హితంగా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తుల సహకారం తోనే పరుషను విజయవంతం చేస్తామన్నారు.



పరుష వివరాలు వెల్లడిస్తున్న సంఘం పదాధికారులు

శారీరక చలనం లేకుంటేనే వెన్నునొప్పి

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): శారీరక చలనం లేకుండా ఒకే ప్రాం తంలో గంటల తరబడి కూర్చోవడం ద్వారా వెన్నునొప్పి ప్రభావం ఎక్కువని వాసవి ఆసుపత్రి ప్రముఖ న్యూరో సర్జన్ ప్రథమ్ బైశాని అభిప్రాయపడ్డారు. నగరంలో వెన్నునొప్పితో బాధపడేవారికి సలహాలు ఇస్తూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కంప్యూటర్ ముందు కూర్చుని ఎక్కువ సమయం గడిపేవారికి వెన్నునొప్పి రావడం సహజమన్నారు. ఐటీ ఉద్యోగులతోపాటు కంప్యూటర్‌తో గంటల తరబడి పని చేసేవారికి వెన్నునొప్పి అవకాశాలు అధికమన్నారు. అందుకు కొన్ని మార్గదర్శకాలు పాటించాలన్నారు. సమగ్రమైన కుర్చీ ఉండాలని, కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్ ఎత్తు సరిచూసుకోవాలన్నారు. కాళ్లు కింద పెట్టాలని, ప్రతి 30 నిమిషాల కోసారి కాసేపు లేచి నడవాలన్నారు. జీవనశైలిలో మార్పులు పాటించాలని, ప్రతి రోజూ వ్యాయామం చేయాలన్నారు. తరచు చిన్నపాటి వ్యాయామాలు చేయాల న్నారు. చేతులు, కాళ్లు, తల తిప్పుతూ కాసేపు గడపాలన్నారు. తద్వారా వెన్నునొప్పికి దూరంగా ఉండవచ్చునన్నారు. పని ఒత్తిడి ఉన్నప్పుడు తలనొప్పి సమస్య రావచ్చునన్నారు. కొంతసమయం కంప్యూటర్, మొబైల్ స్క్రీన్‌లు చూడకపోవడం, తగినంత నీరు తాగడం, సరైన విధానంలో కూర్చోవడం ముఖ్యమన్నారు.

ఫిజిక్స్‌పై చైతన్యమే లక్ష్యం

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): హైస్కూల్, పీయూసీ విద్యార్థులకు ఫిజిక్స్‌పై చైతన్యం కల్పించేలా ఫిజిక్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ బెంగళూరు విభాగం కృషి చేస్తోంది. నగరంలోని థణిసంద్రలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ శ్రీకంఠ ప్రత్యేక అవగాహనా తరగతులు నిర్వహించారు. సబ్జెక్టుపై ఉన్న సందేహాలను తీర్చారు. అనంతరం ప్రొఫెసర్ శ్రీకంఠ మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఫిజిక్స్ సబ్జెక్టుపై ఒక గంటపాటు ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ వర్క్‌షాప్ నిర్వ హిస్తున్నామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు బసవరాజ్ కాగలి, కార్యదర్శి డాక్టర్ నాగరాజ్‌ల నేతృత్వంలో సభ్యులు ప్రతి పాఠ శాలను సందర్శిస్తూ ఫిజిక్స్‌పై విద్యార్థులకు ఉన్న సందేహాలను తీరుస్తున్నామన్నారు. విద్యార్థులను చైతన్యవంతం చేయడమే శిబిరాల ఉద్దేశ్యమన్నారు.



విద్యార్థులతో ప్రొఫెసర్ శ్రీకంఠ

గుడిలో ప్రదక్షిణ చేస్తూ గుండెపోటుతో యువకుడి మృతి

హైదరాబాద్ (హైదర్‌నగర్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుడిలో ప్రదక్షిణలు చేస్తున్న ఓ యువ కుడు ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయి మృతిచెందాడు. కేపీహెచ్‌బీ ఎస్సై శ్రీలతారెడ్డి తెలి పిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లా కదిరికి చెందిన కనంపల్లి విష్ణువర్ధన్(31) కేపీహెచ్‌బీ కాలనీ రోడ్‌నెంబర్-1లోని అమ్మ హాస్టల్‌లో ఉంటూ మాదా పూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 7గంటలకు విష్ణువర్ధన్ కేపీ హెచ్‌బీ కాలనీ ఫేజ్-3లోని ఆంజనేయస్వామి గుడికి వెళ్లాడు. ప్రదక్షిణలు చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి కింద పడిపోయాడు. సహచర భక్తులు ప్రథమ చికిత్స చేసి సమీపంలోని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాంధీ కుటుంబం మెప్పుకోసం డీకే యత్నం

● ఎంపీ యదువీర్ మండిపాటు



ఎంపీ యదువీర్

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లా నుంచి కేరళవైపు వెళ్లే బండీపుర అభయారణ్యానికి అనుబంధంగా ఉండే 766వ నెంబరు జాతీయరహదారిపై రాత్రివేళ సంచారం పునరుద్ధరించేందుకు డీసీఎం డీకే శివ కుమార్ సిద్ధం కావడం గాంధీ కుటుంబం మెప్పు కోసమేనని మైసూరు ఎంపీ యదువీర్ తీవ్రంగా మండిపడ్డారు. బండీపుర నుంచి ఊటీవైపు వెళ్లే 67వ జాతీయ రహదారి, సుల్తాన్ బత్తేరివైపు వెళ్లే 766 జాతీయ రహదారులలో పులులతోపాటు వన్యప్రాణుల రక్షణకోసం 2009 నుంచి రాత్రి సంచారాన్ని నిషేధించారు. రాత్రి 9 గంటలనుంచి ఉదయం 6వరకు ఎటువంటి వాహనాల సంచారం ఉండదు. కేరళ నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చినా కర్ణాటక మాత్రం నిర్ణయంలో మార్పు తేలేదు. కానీ కోజికోడ్ నుంచి కొళ్లేగాళ రహదారి మధ్య రాత్రి సంచారం నిషేధాన్ని పరిష్కరిస్తామని డీసీఎం డీకే శివకుమార్ చెప్పడం విచారకరమన్నారు. యూడీఎఫ్ అభ్యర్థి ప్రియాంకగాంధీ వాద్రా తరపున శనివారం పడింజరతారలో డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడారు. రాత్రి సంచారంపై ఉన్న నిషేధాన్ని తొలగిస్తామనడం బాధ్యతలేని విధానమని ఎంపీ యదువీర్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోమ వారం సోషల్‌మీడియా ద్వారా తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అంశంపై నెటిజన్‌లు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

బందోబస్తు నడుమ దళితుల ఆలయ ప్రవేశం

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండ్య తాలూకా హనకెరె గ్రామంలో ని కాలభైరవేశ్వర ఆలయంలో దళితుల ప్రవేశం పోలీసుబందోబస్తు మధ్యన సాగింది. దేవదాయశాఖకు చెందిన కాలభైరవేశ్వర ఆలయంలో ప్రవేశానికి ఆదివారం దళితులకు అధికారులు అవకాశం కల్పించారు. హనకెరెలో ప్రాచీన ఆలయం ఉండేది. శిథిలావస్థకు చేరడంతో గ్రామస్థులంతా చేరి కోట్లాది రూపాయలతో జీర్ణోద్ధరణ చేశారు. ఉత్సవమూర్తిని ఏర్పాటు చేశారు. అయితే దళితుల ప్రవేశానికి గ్రామంలోని కొందరు అగ్ర కులాలవారు వ్యతిరేకించారు. ఈమేరకు తహసీల్దారు శివకుమార్ బిరాదార్, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నేతృత్వంలో రెండుసార్లు జరిపిన చర్చలు ఫలించలేదు. మరోవైపు దళితులకోసమే నిర్మించిన ఆలయంలో వారు పూజలు చేసుకోవచ్చునని, మా గుడికి ఎందుకని అభ్యంతరం తెలిపారు. చివరకు ఆదివారం అధికారులు దళితుల ఆలయ ప్రవేశ జరిపించి పూజలు చేయించారు. అయితే ముందస్తు చర్యల్లో భాగంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాగా హాసన్ జిల్లా కోణనూరు సమీపంలోని బిదనూరు బసవేశ్వర ఆలయంలో దళితుల ప్రవేశాన్ని అడ్డుకున్న అర్చకుడు కాంతరాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గ్రామానికి చెందిన ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. గ్రామంలో పికెటింగ్ కొనసాగుతోంది.



కాలభైరవేశ్వర ఆలయంలో పూజలు

న్యాయపోరాటాలకు మద్దతు

బంగారపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సమాజం సర్వతోముఖాభివృద్ధి ప్రగతితోపాటు బాధితులకు అండగా ఉంటూ న్యాయ పోరాటాలు చేసేందుకు భీమ్ ప్రజాసంఘం కట్టుబడి ఉందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైట్‌ఫీల్డ్ మురుగేశ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో సంఘం జిల్లాశాఖ నేతృత్వంలో ఏర్పాటైన కార్యక్రమంలో మహిళా విభాగాల అధ్యక్షులు, పదాధికారులను ఎంపిక చేశారు. బంగారపేట మహిళా విభాగం అధ్యక్షురాలిగా మంజుళ నియ మితులయ్యారు. ఈ సందర్భంగా మురుగేశ్ మాట్లాడుతూ భీమ్ ప్రజాసంఘం ఒక వర్గానికి లేదా ఒక పార్టీకి పరిమితి కాలేదన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని కులాలు, మతాలకు చెందిన ఇబ్బందుల్లో ఉన్నవారికి అండగా ఉంటామన్నారు. పేద, దళిత, శ్రామిక, రైతుల న్యాయ పోరాటాలకు మద్దతు ఇస్తామన్నారు. జిల్లా, తాలూకా కేంద్రాలలో అంబేడ్కర్ క్యాంటీన్‌లు స్థాపించడం లక్ష్యమని, ఆకలి లేని సమాజ నిర్మాణం కోసం తమవంతుగా వైట్‌ఫీల్డ్ సమీపాన అంబేడ్కర్ క్యాంటీన్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీన్ని అన్ని ప్రాంతాలకు విస్తరించడమే లక్ష్యమన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెసరనహళ్ళి యల్లప్ప, జిల్లా అధ్యక్షుడు మునిరాజుతోపాటు తాలూకా అధ్యక్షుడు మనోజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు మంజుళ, ప్రముఖులు రంగనాథ్, నాగరాజ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



భీమ్ ప్రజాసంఘం పదాధికారుల నియామకం

ఉపాధి పనుల్లో రూ.51 వేల అవినీతి

నల్లమాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలం లోని 14 పంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి పథకం కింద చేపట్టిన పను లను సామాజిక బృందం తనిఖీ చేసింది. సోమ వారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహిం చిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆ వివరాలను అధికారులు వెల్లడిం చారు. పీడీ విజయ్‌కుమార్, ఏపీడీ జ్యోతి, విజిలెన్స్ అధికారి నాగేశ్వర రావు మాట్లాడుతూ.. మండలంలోని 14 పంచాయతీల్లో మొత్తం సుమారు రూ. 13 కోట్ల పనులు చేపట్టగా.. రూ.51,755 అవినీతి జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎపీఓ సూర్యనారాయణ, రఘునాథ్ రెడ్డి, ఈసీ షేక్షా వలీ, ఎస్ఆర్‌పీ ఆవులయ్య, టీఏలు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు

కదిరి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని జనసేన నాయకులు ధ్వజమెత్తారు. సోమ వారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ భైరవప్రసాద్ మాట్లా డుతూ... వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని కోలుకోలేని విధంగా సర్వనాశనం చేసిందన్నారు. రాష్ట్రంలో అసాంఘిక చర్యలకు పాల్పడుతున్న వారిపై కూటమి ప్ర భుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంద న్నారు. సోషియల్ మీడియలో మహిళలపై అసభ్య కర పోస్టర్లు పెడుతున్నవారిపై చర్యలు తీసుకో వడం తప్పా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో చిన్న ప్పరెడ్డి, లక్ష్మన్, రవికుమార్, గంగరాజు, రాజేంద్రప్ర సాద్, రమణ పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

పుట్టపర్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ముస్లీం మైనార్టీల శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని ముస్లీం మైనార్టీ నాయ కులు కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతిపత్రం అంద జేశారు. సోమవారం మహమ్మద్ రఫీ, షామీర్, కాశీం కుళ్లాయప్ప, దాదా ఖలందర్, సయ్యద్, ఫక్ర ద్దీన్ తదితరులు కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. శ్మశాన వాటికకు స్థలంలేక ఇబ్బందులు పడుతున్నట్టు వివరించారు. ఉర్దూ పాఠశాల ఏర్పాటు చేయాలని, షాదీమహల్ నిర్మా ణాన్ని పూర్తి చేయడానికి మరో రూ.55 లక్షలు కేటా యించాలని కలెక్టర్‌ను కోరారు.

వీరవనిత ఒనకె ఓబవ్వ ఆదర్శప్రాయులు

బాగేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కోటను శత్రువుల సైన్యం నుంచి రక్షించడంలో స్వామినిష్ఠ, సమయస్ఫూర్తి, త్యాగానికి ప్రతీక ఒనకె ఓబవ్వ ధైర్యసాహసాలు మరువరాదని తహసీల్దారు మనీశా మహేశ్‌పత్రి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఒనకె ఓబవ్వ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. కోటను సైనికులు చుట్టు ముట్టినప్పుడు తన ఇంట్లో ఆహార సంస్కరణకోసం ఉప యోగించే రోకలిని ఆయుధంగా ఉపయోగించి శత్రువులను చీల్చి చెండాడిందన్నారు. వీరవనిత ఓబవ్వ సమయప్రజ్ఞ ధైర్య సాహసాలు నేటిబాలికలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఛలవాది సామాజికవర్గం టి రామప్ప మాట్లాడుతూ విద్య, ఆర్థిక, సామాజికంగా వెనుకబడిన అంశాలలో రాష్ట్రంలో చలవాది ఐకమత్యం పెరగాల్సి ఉందన్నారు. తాలూకా ఆరోగ్య అధికారులు డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, బీఈఓ ఎన్ వెంకటేశప్ప, పురసభ ముఖ్యాధికారి శ్రీనివాస్, బిళ్ళూరు నాగరాజు, విద్యాశాఖ శివప్ప తదితరులు పాల్గొన్నారు.

బంగారపేటలో...

బంగారపేట: తాలూకా కార్యాలయంలో ఒనకె ఓబవ్వ జయంతిని సోమవారం అర్థవంతంగా ఆచరిం చారు. గ్రేడ్ - 2 తహసీల్దారు గాయత్రి స్వయంగా ఓబవ్వ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓబవ్వ ధైర్య సాహసాలు మహిళలకు, యువతులకు స్ఫూర్తి దాయకమన్నారు. ఈ సందర్భంగా సమన్వయ అధికారి శశికళ, సాంఘిక సంక్షేమ అధికారి అంజలిదేవి, అక్షర దాసోహ సహాయక డైరెక్టర్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.



బాగేపల్లి తహసీల్దారు కార్యాలయంలో ఒనకె ఓబవ్వ జయంతి



బంగారపేట తాలూకా కార్యాలయంలో

ఆనేకల్ పురసభ వార్డు బీజేపీ అభ్యర్థిగా హరీశ్ నామినేషన్

దొమ్మసంద్ర, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ పురసభలోని 22వ వార్డు నుంచి బీజేపీ అభ్యర్థిగా హరీశ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈనెల 23న వార్డు సభ్యుడి స్థానానికి ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హరీశ్ తన అనుచరులతో కలసి సోమవారం నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి ఏ నారాయణ స్వామి మాట్లాడుతూ వార్డు ఎన్నికల్లో విజయం తథ్యమనే ధీమాను వ్యక్తం చేశారు. ఆనేకల్ బీజేపీ హోబళి అధ్యక్షుడు నాయనహళ్ళి మునిరాజుగౌడ, బీజేపీ ప్రముఖులు నరసింహరెడ్డి, నాగరాజ్‌తోపాటు జేడీఎస్ ప్రముఖులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ వేళ హరీశ్‌తో కేంద్ర మాజీ మంత్రి నారాయణస్వామి తదితరులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,605.65
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,536	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,116	9,052
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	29.76

వ్యక్తి అదృశ్యం



నరసింహులు

బళ్లారి రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని వైకగ్గల్లు గ్రామానికి చెందిన నరసింహులు (40) ఈ నెల 3వ తేదీ ఇంటి నుంచి కనపడడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. బయటకు వెళ్లొస్తానని భార్యకు చెప్పి వెళ్లిన అతను ఇంతవరకు ఇంటికి తిరిగి రాలేదని పీడీ హళ్లి పోలీసులకు భార్య శోభ ఫిర్యాదు చేశారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు 9480803052 నెంబర్‌కు సంప్రదించవలెనని పోలీసులు తెలిపారు.

పాదాల కట్ట ధ్వంసం



ధ్వంసమైయిన పాదాలకట్ట

బళ్లారి సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం కొందరు దుండగులు విజయనగర కాలం నాటి ఆలయ పాదాలను ధ్వంసం చేశారు. తిమ్మలాపూర్ గ్రామంలోని వేణుగోపాల దేవాయం సమీపంలో 15వ శతాబ్దానికి చెందిన విజయనగర రాజులు నిర్మించిన హోసూరమ్మ దేవాయంలో హోసూరమ్మ ఆలయ పాదాలకట్టను తవ్వి ధ్వంసం చేశారు. గుప్త నిధుల కోసమే ఈ పని చేసినట్లు అధికారులు భావిస్తున్నారు.

వీరవనిత ఓబవ్వ నేటి మహిళలకు స్ఫూర్తిదాయకం: మేయర్



మాట్లాడుతున్న మేయర్ ముల్లంగి నందీష్ బాబు

బళ్లారి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వీరవనిత ఒనకె ఓబవ్వ సాహసం, దేశభక్తి నేటి మహిళలకు స్ఫూర్తిదాయకమని బళ్లారి మహానగర పాలికె మేయర్ ముల్లంగి నందీష్ బాబు అన్నారు. నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో సోమవారం జిల్లా పాలనా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, కన్నడ, సాంస్కృతిక శాఖ మహానగర పాలికె ఆధ్వర్యంలో నిర్వహించిన వీరవనిత ఒనకే ఓబవ్వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ నందీష్ బాబు మాట్లాడుతూ ఓబవ్వ సమయపాలన, ధైర్యసాహసాలు, ఆశయాలు ప్రతి మహిళా అనుకరించాలన్నారు. రచయిత, మేధావి డాక్టర్ లింగన్న జంగమనహళ్లి మాట్లాడుతూ శత్రు సైనికులను తన సమయస్ఫూర్తితో చుక్కలు చూపించిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. తహశీల్దార్ గౌసియా బేగం, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జలాలప్ప సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మల్లికార్జున, సి. శివకుమార్, సీనియర్ సాహితీవేత్త ఎన్.డీ. వెంకమ్మ, జర్నలిస్టు సి. మంజునాథ్, ప్రజాసంఘాల నాయకులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిరుగుప్ప/కంప్లి : బ్రిటీషర్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీర వనిత ఒణికేఓబవ్వ అని సిరుగుప్ప తహసీల్దార్ విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం సిరుగుప్ప పట్టణంలో తాలుకా పరిపాలన, సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఓణికే ఓబవ్వ జయంతి వేడుకలు నిర్వహించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ విశ్వనాథ్



కంప్లిలో..



విద్యార్థులతో కళాకారుడు హనుమంతరావు

ఆకట్టుకున్న తోలుబొమ్మలాట

బళ్లారి సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జీవితం ఆధారంగా 'బాపూజీ' అనే తోలు బొమ్మల ప్రదర్శనను అంతర్జాతీయ ప్రసిద్ధి చెందిన శ్రీమారాంజనేయులు, తోలు బొమ్మల మేళా ట్రస్ట్ మేళా బళ్లారి శ్రీమతి గాలి రుక్మిణమ్మ స్మారక ప్రభుత్వ వాణిజ్య కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ తోలుబొమ్మలాటకు వేల సంవత్సరాల చరిత్ర ఉందని, అలాంటి కళకు కొత్త ఒరవడిని అందించి తోలుబొమ్మలాటలో విప్లవాత్మకమైన విప్లవం తెచ్చిన పురాణ నాడోజ బెళగల్లు వీరన్న అని అన్నారు. ఆయన వారసత్వాన్ని ఇప్పటికీ తన పిల్లలు కొనసాగించడం అభినందనీయమన్నారు.నాడోజ శ్రీ బెళగల్లు వీరణ్ణ తనయుడు బెళగల్లు హనుమంత ప్రభుత్వ ఆదర్శ విద్యాలయంలో సంగీత ఉపాధ్యాయునిగా సేవలందిస్తున్న ఆయన కళను కేవలం కుటంబానికే పరిమితం చేయకుండా, ఆసక్తి గల విద్యార్థులకు బోధిస్తూ తన తండ్రి బాటలో పయనిస్తున్నారన్నారు. ఈసందర్భంగా బెళగల్లు హనుమంతరావును సన్మానించారు.

పార్టీ అధ్యక్షుడు మారే అవకాశం

● బీజేపీ నేత రమేశ్ జార్కిహొళి

రాయచూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పార్టీ నాయకత్వం డిసెంబరు నెలాఖరులోగా మారే అవకాశం ఉందని బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళి అన్నారు. సోమవారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి స్పష్టమైన మెజార్టీ దక్కడం ఖాయమన్నారు. వక్ఫ్ ఆస్తుల విషయానికి సంబంధించి ముఖ్యమంత్రి చేస్తున్న ప్రకటనలు, తీసుకున్న నిర్ణయం తాత్కాలికమని వాటన్నింటికి చట్టభద్ధత ఉండదన్నారు. కేసులతో సీఎం సిద్దరామయ్యకు భయం మొదలయ్యిందన్నారు.

బీజేపీ పాలనలో దేశమంతటా అశాంతి

● ఏ రాష్ట్రంలోనూ ఒక్క నీటి ప్రాజెక్టు నిర్మించలేదు
● ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి గోపీనాథ్ విమర్శ



బళ్లారి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక శాంతి కొరవడిందని, కులాల మధ్య, మతాల మధ్య చిచ్చురేపి ప్రశాంతతకు భంగం కల్గిస్తుందని అల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి, హైద్రాబాద్ కర్ణాటక జిల్లాల ఇన్‌చార్జి గోపీనాత్ పళనియప్పన్ విమర్శించారు. సోమవారం సండూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎక్కడైనా ఒక్క నీటి ప్రాజెక్టు నైనా నిర్మాణం చేసిందా. అంతెందుకు బీజేపీ అధికారంలో ఉండే రాష్ట్రాల్లో కూడా ఏ ఒక్క నీటి ప్రాజెక్టును నిర్మాణం చేయలేదని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే కర్ణాటకలోని తుంగభద్ర నిర్మాణం జరిగిందన్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకూ రాహుల్ గాంధీ పాదయాత్రచేసి పేదల ఇబ్బందులు, దేశ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకున్నారన్నారు. బీజేపీ అధికారలో నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. సండూరులో బీజేపీ నాయకులు ప్రకృతి సంపదను దోచుకోవడం కోసమే వచ్చారని ఇక్కడ బీజేపీకి అవకాశం ఇవ్వొదండని కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆయన కోరారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ ప్రచారం



తోరణగల్లు ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ

తోరణగల్లు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నేతలు పోటా పోటీగా ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి ఇ. అన్నపూర్ణ, ఇతర కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి గ్రామాల్లోని దుకాణాలు, రైతులు, కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ అభ్యర్థితో పాటు రాష్ట్ర బీజేపీ నాయకుడు విజయేంద్ర, గాలి జనార్దన్‌రెడ్డి ఆదివారం రాత్రి బహిరంగ ప్రచారంతో చేశారు. సోమవారమూ ప్రచారం జోరుగా సాగింది.



ఆదివారం రాత్రి బహిరంగ సభలో బీజేపీ నాయకులు

కొవిడ్‌లో భారీ అక్రమాలు

● కున్హా నివేదిక అదే తేల్చింది..
● శ్రీరాములు, యడ్డీలకు అదే భయం
● కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్



బళ్లారి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొవిడ్ కాలంలో మందుల పంపిణీలో వేల కోట్ల అక్రమాలు జరిగాయని, కున్హా కమిషన్ ఇదే తేల్చిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్ పేర్కొన్నారు. సోమవారం నగరంలో జిందాల్ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రోగులకు మందులు, సూదులు, కిట్లు, పరికరాల కొనుగోళ్ల లో అప్పటి బీజేపీ ప్రభుత్వం వేల కోట్ల అక్రమాలకు పాల్పడిందన్నారు. కున్హా నివేదికపై అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి శ్రీరాములు, మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప భయపడుతున్నారన్నారు. ఉప ఎన్నికల్లో మూడు చోట్ల కాంగ్రెస్ విజయం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.

సండూరులో కాంగ్రెస్ అభ్యర్థి ఇ. అన్నపూర్ణ విజయం ఖాయమన్నారు. బీజేపీ అభ్యర్థికి ఇక్కడి పరిస్తితి, ప్రజల మనోభావాలు ఏమీ తెలియదు, ఆయన్ను బీజేపీ ఎక్కడి నుంచో దిగుమతి చేసుకుందన్నారు. ఎక్కడి నుంచో వచ్చిన హనుమంతకు ఇక్కడి ప్రజల బాధలు, మనోభావాలు ఎలా అర్థం అవుతాయన్నారు. కాంగ్రెస్ హయాంలో అభివృద్ధిని పరుగులు పెట్టించామన్నారు. ఇంతక ముందు బీజేపీ అధికారంలో మంత్రులుగా శ్రీరాములు, గాలి జనార్దన్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి ఉన్నారు. అలాగే ఎంపీగా శాంత ఉంది. ఈ నలుగురూ బీజేపీలో ఒకే వర్గం వారే సండూరుకు ఏమి అభివృద్ధి చేశారో చూపాలని కోరారు. సండూరు ఉప ఎన్నికల్లో ఖచ్చితంగా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : ఎమ్మెల్యే



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

కంప్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి తెలిపారు. సండూరు ఉప ఎన్నికల సందర్భంగా కుడితినిలో కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణమ్మ గెలుపు కోసం ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనతో కుడితిని ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, ఎంపీ తుకారాం ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. సీఎం సిద్దరామయ్య, డీకే శివకుమార్ ఇచ్చిన ఐదు గ్యారెంటీ పథకాలు పేదలకు మేలు చేస్తున్నాయన్నారు. కుడితినిలో వీరాజశేఖర్, అంజి, వీరేంద్ర కుమార్, బీసన్న, చంద్రప్ప, వెంకటరమణబాబు తదితరులు ఎంతో మంది కాంగ్రెస్‌లో చేరి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం జెక్కి అంజి నివాసంలో పలువురిని పెద్దలతో చర్చలు కూడా జరిపారు. వారితో పాటు ప్రతాప్, గంగాధర, కనికేరి పంపాపతి, చంద్రయ్య దొడ్డ బసప్ప, మంజునాథ, జాకీర్, రాము, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

దత్తతను చట్టబద్ధంగా తీసుకోవాలి

● రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అభిషేక్ కుమార్



మాట్లాడుతున్న రైల్వే సీఐ అభిషేక్ కుమార్

రాయచూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బాలలను దత్తత తీసుకునే వారు అందుకు సంబంధించిన చట్టాల ఆధారంగానే దత్తత తీసుకోవాలని గుంతకల్ రైల్వే విభాగం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా దత్తత స్వీకరించడం వల్ల భవిషత్తులో అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం రాయచూరు నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన రైల్వే సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అభిషేక్ కుమార్, బాలలను ఎత్తుకెళ్లె వారు అక్రమ రవాణ చేస్తు కొంతమందికి అమ్ముకుంటున్నారని అలాంటి వారిని దత్తత తీసుకోవడం వల్ల భవిషత్తులో అనేక రకాల చట్టబద్ధమైన సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ విషయంలో దత్తత స్వీకరించే వారు 18 ఏళ్ల లోపు బాలలను చట్టబద్ధంగా సంబంధిత అధికారులకు తగిన సమాచారాన్ని ఇచ్చి అందుకు సంబంధించి విధి విధానాలు పాటించాలన్నారు.

సంప్రదాయాలు మరువవద్దు

కంప్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు గ్రామాల్లో, పట్టణాల్లో తమ పిల్లలకు దేశ సాంప్రదాయాలపై ఆసక్తి పెంచుకునేలా తెలియజేయాలని చిక్కినకొప్ప చెన్నవీర మహాస్వాములు తెలిపారు. కలబురిగి శరణు బసవేశ్వర 44 పురాణపఠనం సందర్భంగా ముత్తయిదువు మహిళలకు ఒడి నింపే కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఎక్కడ గౌరవిస్తామో అక్కడ ప్రశాంతమైన జీవనం కొనసాగుతుందన్నారు. ఈ నెల 15న గ్రామంలో బసవేశ్వర, నీలమ్మ రథోత్సవం, పూజలతో గ్రామంలో ప్రశాంతత నెలకొంటుందన్నారు.



మహిళలను ఆశీర్వదిస్తున్న వీర మహాస్వాములు

పాహిమాం..పరమేశ్వరా..!



బళ్లారిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



చెళ్లకెరలో..

బళ్లారిరూరల్/కంప్లి నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం సందర్భంగా శైవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఓంకార నాదంతో ఆలయాలు మార్మోగాయి. తెల్లవారుజామునుంచే భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో దీపాలు వెలిగించడంతో శోభాయామానంగా దర్శనమిచ్చాయి.



అలంకరణలో ఎర్రితాత



మోకా మల్లేశ్వరస్వామి



కోటమల్లేశ్వరస్వామి



కంప్లిలో ముక్తినాథేశ్వరుడు



కంప్లి శివాలయంలో..

హోసూరు జోన్

పథకాలపై ఛాయాచిత్ర ప్రదర్శన

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో అన్ని శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలు, సంక్షేమ సహాయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేక ఛాయాచిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేస్తోంది. కృష్ణగిరి జిల్లా ఊత్తంగరై పంచాయతీ యూనియన్ మెట్టుకోటై గ్రామంల్లోని పావకల్ పంచాయతీలో పౌర సంబంధాల శాఖ నేతృత్వంలో ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. పీపుల్ సికింగ్ మెడిసిన్, హోం సిక్కింగ్ ఎడ్యుకేషన్, ఇన్నోవేటివ్ ఉమెన్ స్కీమ్, ముఖ్యమంత్రి అల్పాహార పథకం, ఆర్టిస్ట్ విమెన్ ఎంటైటిల్‌మెంట్ స్కీమ్, తమిళ్ స్కీమ్, కృష్ణగిరి జిల్లాలోని హిల్ విలేజ్‌లకు 108 అంబులెన్స్‌లు, వైద్య శిబిరం తదితర పథకాలు ప్రదర్శనలో ఉంచారు. అభివృద్ధి పథకం, రైతులకు సబ్సీడితో కూడిన వ్యవసాయ పనిముట్లు, రైతులకు 1.50 విద్యుత్ కనెక్షన్ అందించే పథకం, నేనే మొదటి పథకం, వికలాంగులకు సంక్షేమ సహాయం, పాఠశాల విద్యార్థులకు ఇంద్రధనస్సు పథకం, విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ, మహిళా స్వయం సహాయక బృందాలకు వ్యాపార రుణాలు తదితర పథకాల గురించి ఫోటోలతో వివరించారు.

నేడు విద్యుత్ కోత

హోసూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మత్తుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌కోత ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టివిఎస్ నగర్, అందివాడీ మత్తిగిరి, టైటాన్ టౌన్‌షిప్, గాడిపాళ్యం, పాత మత్తిగిరి, యడేనల్లూరు, శివకుమార్ నగర్, కొత్తూరు, కొత్తకొండపల్లి, బొమ్మండపల్లి, మునీశ్వర నగర్, ఆధవన్ నగర్, ద్వారక నగర్, మత్తం, న్యూ హడ్కో, మహాలక్ష్మి నగర్ ఫేజ్ 1, ఫేజ్ 2 రాంనగర్, బస్టాండ్, శ్రీనగర్, అప్పావు నగర్ , కామరాజ్ కాలనీ, అన్నానగర్, టైటాన్ ఇండస్ట్రీస్, అశోక్‌లేలాండ్ 1, సిప్‌కాట్ హౌసింగ్ కలనీ, నేతాజీ నగర్, బాలాజీ నగర్, చిన్న యలసగిరి, ఆనందనగర్, శాంతపురం, అరసనట్టి, కేసీసీ నగర్, సూర్యనగర్, బృందావన్ నగర్, అన్నామలై నగర్, కృష్ణానగర్, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు.



విశేష అలంకరణలో అమ్మవారు

వైభవంగా కుంభాభిషేకం

హోసూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హోసూరు మునిసిపాలిటీ పరిధిలోని చిన్న యళసగిరిలో వెలసిన రేణుకాయల్లమ్మ దేవి ఆలయ కుంభాభిషేక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్తీక సోమవారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని ఇటీవల జీర్ణోద్ధరణ చేశారు. ఈ నేపథ్యంలో శ్రీ రేణుకా యల్లమ్మదేవి కుంభాభిషేకంలో భాగంగా సోమవారం సుప్రభాత సేవలు, వేదపారాయణం, కలశ ఆరాధన, సప్త మాతృకలను పునఃప్రతిష్ఠించారు. ప్రాణ ప్రతిష్ఠ హోమం, మూర్తి హోమం, శాంతి హోమం, 30 మహా పూర్ణాహుతి కలశ పూజలు, నయననీల హోమం, ప్రాయశ్చిత్త హోమం, పంచామృత అభిషేకం, వివిధ హోమాల అనంతరం మహా మంగళారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల్లో మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, మున్సిపల్ హెల్త్ కమిటీ చైర్మెన్ కౌన్సిలర్ మాదేశ్వరన్, బీజేపి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్, డీఎంకే ప్రాంతీయ కార్యదర్శి రాము, హోసూరు స్క్రాప్ డీలర్ సంఘం అధ్యక్షుడు మురుగన్, సామాజిక కార్యకర్త మణి, ఉప కార్యదర్శి మోహన్, కార్యవర్గ సభ్యులు గణేశన్ తంగమునిస్వామి సెల్వమురుగన్ పాల్గొన్నారు.

రైతుల ఆందోళన

రాయచూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యల పరిష్కారంతో పాటు న్యాయమైన డిమాండ్‌ల సాధన కోసం కర్ణాటక రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం నగరంలోని టిప్పుసుల్తాన్ గార్డన్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడిన రైతు సంఘం నాయకులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పత్తి కనీస మద్దతు ధర తక్కువగా ఉన్న నేపద్యంలో రాష్ట్ర ప్రభుత్వం క్వింటాళ్‌కు రూ.2000 ప్రోత్సహక నగదును ఇచ్చి రైతులకు న్యాయం చేయాలన్నారు. 2023-24 సంవత్సరంలో ఫసల్ భీమ పథకం ద్వార రైతులు కిస్తు చెల్లించినా ఇప్పటి వరకు వారికి పరిహారం అందలేదని రైతులకు వెంటనే పరిహారం అందజేయాలన్నారు. 2023-24 సంవత్సరంలోనే ప్రభుత్వం వర్షభావ పరిస్థితిల నేపధ్యంలో కరువు ప్రాంతంగా ప్రకటించినా ఇప్పటి వరకు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల రైతులు నది వాగు పక్క ఉన్న వాటికి పంటలు మునిగి తీవ్రంగా నష్టపోయారని అలాంటి రైతులను గుర్తించి వారికి పరిహారం అందజేయాలన్నారు. కాగా వ్యవసాయ మార్కెట్‌లో శాంపళ్ల పేరుతో కందులు వేరు శెనగ, ఉల్లిపాయలను సేకరిస్తు దళారులు రైతులను మోసగిస్తున్నారని వాటికి అడ్డుకట్ట వేయాలన్నారు. అదే సమయంలో పత్తి మార్కెట్‌లోను రైతుల నుంచి తేమశాతం పేరుతో కోత విధిస్తు నష్టానికి గురి చేస్తున్నారని రైతులకు తగిన న్యాయం చేసి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



టిప్పుసుల్తాన్ గార్డెన్ వద్ద ఆందోళన చేపట్టిన రైతులు

సండూరులో 300 పడకల ఆసుపత్రి

● మహిళలకు ప్రత్యేక ప్రసూతి ఆసుపత్రి
● లారీలకు టోల్‌గేట్ల వసూళ్లు నిలిపివేస్తాం
● గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి



మాట్లాడుతున్న గాలి జనార్దన్‌రెడ్డి, పక్కన బీజేపీ నాయకులు

బళ్లారి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సండూరులో 300 పడకల ఆసుపత్రిని నిర్మించి తీరుతామని, గర్భిణీలకు ప్రత్యేక ఆసుపత్రి నిర్మిస్తామని, బీజేపీ అధికారంలో రూ. 250 కోట్ల అభివృద్ధి పనులు చేశామని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సండూరు బీజేపీ కార్యాలయంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు మోకా అనీల్ నాయుడు, ఇతర బీజేపీ నాయకులతో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాలో కేఎంఆర్‌సీ నిధులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని జిల్లా అభివృద్ధి కోసం వినియోగించు కోలేదని కనీసం ప్రణాళిక కూడా వేయలేదని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. కేఎంఆర్‌సీ నిధులతో కమీషన్ పొందేందుకు కాంగ్రెస్ ఎంపీ కాంట్రాక్టర్లను, అధికారులు బెదిరించారని విమర్శించారు. వాల్మీకి నిగమ మండలిలో రూ. 189 కోట్లు అక్రమాల చేసి వాల్మీకులు ఇతర ఎస్టీ వర్గాలకు మోసం చేశారన్నారు. ఇందులో సీఎం పాత్ర కూడా ఉందన్నారు. బీజేపీ కాలంలో బళ్లారి స్టీల్ హబ్‌గా మార్చామని, బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే లారీలకు టోల్ గేట్లు వసూళ్లు నిలిపివేస్తామన్నారు. నిధులున్నా అభివృద్ధిపై కాంగ్రెస్ దృష్టి పెట్టలేదన్నారు. సీఎం యడియూరప్ప హయాంలో వేసిన రోడ్లే తప్ప సండూరులో రోడ్లపై కాంగ్రెస్‌కు ఆసక్తి లేదన్నారు. రానున్న రోజులన్నీ బీజేపీకి ఆశాజనకంగా ఉన్నాయన్నారు. దేశమంతా బీజేపీ ప్రభంజనం మొదలయ్యిందన్నారు.